చిట్టికథల పోటీలో రూ. 150 బహుమతి పొందిన కథ

# ఇష్టాయిష్టాలు



— వాలి. హిరణ్మయీదేవి

"ఇదేంటి? బెండకాయల్నిలా తగలేశావ్? ఎవరైనా వేపుడుగాని, పులుసుగాని చేస్తారు గాని కూరలా వండుతారా?" అంటూ అరుస్తున్నాడు ప్రసాదరావు.జానకి ఏదో మెల్లిగా నచ్చచెపుతోంది. అయినా కూడా ఏదో సణుక్కుంటూనే భోంచేస్తున్నాడు ప్రసాదరావ్. ప్రక్కరూంలో కూర్చుని పేపర్ తిరగేస్తున్న రవికన్నీ విన్పిస్తూనాన్నాయి.

"బహుశా నూనె అయిపోతేనో - చింతపండు లేకపోతేనో - అమ్మ అలా కూరగా వండి వుంటుంది. తనూ తిన్నాడుగా ఆ కూర - జిగురే మాత్రం లేకుండా వుంది. టమోటలు వేసి, కొన్నే నీళ్ళు పోసి దగ్గరగా ఇగిరేలా వండిందేమో చాలా రుచిగా ఉంది. రుచి చూడకుండానే అరవడం నాన్నకి మామూలే. ఈ కూరేకాదు, ఇంట్లో ఏం ఉన్నా - లేకున్నా ఉన్నదాంతోనే రుచిగా వండటం చాలామందికి తెలీదు. కానీ అమ్మ అలా కాదు. ఉన్నంతలోనే రకరకాలుగా - ఎంతో రుచికరంగా చేస్తుంది - అయినా పాపం నాన్నగారి సణుగుళ్ళు తప్పవు. ఆయన భోంచేసి లేచేంతవరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుర్చున్నట్లుండే అమ్మను చూస్తే ఎంతో జాలి వేస్తుంది. తిండి విషయంలో నాన్నగారెందుకింత హంగామా చేస్తారో అర్థంకాదు. బతకడాన్కి తినాలి తప్ప తినడానికి మాత్రమే బతకకూడదని తన అభి ప్రాయం.

కానీ నాన్నగారు మాత్రం "ఇంత కష్టపడి సంపాదించేది కడుపుకింత కమ్మగా తినడానికేగా" అంటారు. ఇలా ఒక ఇంట్లోనే భిన్నాభిప్రాయాలు లోకంలో ఇంకెన్ని వుంటాయోగాని.

"ఏరా! ఏం చేస్తున్నావ్. అలాఖాళీగా కూర్చోక పోతే వెళ్ళి ఆ కరెంట్ బిల్ కట్టి రాకపోయావా" అన్న ప్రసాదరావ్ అరుపులతో ఈ లోకంలోకి వచ్చిపడ్డాడు రవి.

"నిన్ననే కట్టి వచ్చానండి" కుర్చీలోంచి లేస్తూ చెప్పాడు రవి.

తండ్రిలోని ఈ మరో గుణం కూడా రవి కస్సలు నచ్చదు. పని జరిగిందో లేదో తెలుసుకోకుండా ముందే రంకెలు వేయటం! మెల్లిగా మాట్లాడటం మరిచిపోయి ఎంత కాలమయిందో ఈయన. అనుకొంటూ మనసులోనే కాస్త చిరాకుపడ్డాడు రవి.

డిగ్రీ పూర్తి చేసి మహా అయితే సంవత్సరయిందేమో... ఇలా ఉద్యోగం లేకుండా వుండటం ఆయన దృష్టిలో మహానేరం. ఏది చెప్పాలనుకొన్నా - చెప్పబోయినా "అలా ఖాళీగా కూర్చోకపోతే..." అంటూ మొదలెడతారు. ఎంతగా అలవాటు పడాలనుకున్నా - ఆ పదం రవిని ఎప్పటికప్పుడే అమితంగా బాధిస్తూ వుంటుంది. అక్కడికి సాయంత్రాలు నలుగురు పిల్లలకు ట్యూషన్లు చెబుతూ ఓ రెండొందలు సంపాదిస్తూ తన చేతి ఖర్చులకుపోను, అప్పుడూ - ఇప్పుడూ ఓ పదీ పరకా తల్లిచేతికి ఇస్తుంటాడు.

ఇంట్లో తల్లికి పనుల్లో సాయపడటానికే మాత్రం సంకోచించడు. బజారు పని మొత్తం చేసుకొస్తాడు. అయినా సరే తండ్రి అక్షింతలు జల్లకుండా వుండడు.

ధరలు ఆకాశాన్నంటే ఈ రోజుల్లో ఒక్కరి సంపాదనతో ఇల్లు గడవటం కష్టమే. దానికి తోడు పెద్దకూతురు పురుటికి, చిన్నకూతురు పెళ్ళికి చేసిన అప్పులూ - జీతంలో నుండే తీర్చవలసి రావడంతో - నెల చివరి రోజుల్లో బొటాబొటిగా ఖర్చుపెట్టాల్సి వస్తుంది. అదనంగా వచ్చే ఖర్చులతో అనుకోకుండా వచ్చే చుట్టాలతో తప్పనిసరిగా అప్పైనా చేసి - ఆ ఖర్చుల్ని వెళ్ళదీయాల్సివుంటుంది. ఈ ఆర్థికపు బాధలకు తట్టుకోలేక, తన విసుగుని - కోపాన్ని ఇంట్లో అందరిమీదా చూపిస్తూంటారు ప్రసాదరావుగారు. అది అర్థం చేసుకునే ప్రతి ఒకరూ సర్దుకుపోతూంటారు.

• • •

రవికి ఓ లిమిటెడ్ కంపెనీలో అకౌంటెంట్‌గా ఉద్యోగం దొరకడంతో ఇంట్లోని ఆర్థికబాధలు మెల్లిమెల్లిగా తగ్గుముఖం పట్టాయి.

అయితే ప్రసాదరావుగారు తన స్నేహితుడి కొడుకు పెళ్ళికి వెళ్ళి వచ్చింది మొదలు, అతనిలో బీజం నాటుకొన్న కోరికవల్ల సన్నని వాన తుంపర్లా అప్పుడప్పుడు వాగ్వివాదాలు జరిగేవి. ఐతే సహజంగా పెద్దలపట్ల భయభక్తులతో పెరిగిన రవి ఎప్పటికప్పుడు మౌనం వహిస్తుండటంతో ఆ తుంపరలు 'గాలివానగా' మారే ప్రమాదం జరగలేదు.

ఓ రెండేళ్ళు ఓపికపట్టినా వీలున్నప్పుడల్లా "ఫలానా నా ఫ్రెండ్ లేడూ... వాడు తన కొడుక్కి డెబ్భయివేల కట్నం పుచ్చుకొన్నాడనో, "వరుసకి నీకు పెదనాన్నవుతాడ్లే మంచి డబ్బున్న వారి సంబంధం చూశాడు. కొడుకుతోపాటూ తనూ సుఖపడుతున్నాడు" అంటూ ప్రస్తావించేవాడు. ఆడపిల్లల పెళ్ళిళ్ళపుడు 'కట్నం - లాంఛనాలు' పేరెత్తితేనే వీరభద్రుడిలా మండిపడ్డ ప్రసాదరావు ఈయనేనా అన్నట్లు విస్మయంతో చూసేవాళ్ళు జానకమ్మ - రవి.

"రవీ! మా ఆఫీసుకివాళ పెళ్ళిళ్ళ పేరయ్య వచ్చాడు - ఓ మంచి సంబంధం తెచ్చాడు" అన్నాడో రోజు సూటిగా.

"తరళకి సంవత్సరం అయితే డిగ్రీ చేతికందుతుంది. మధ్యలో పెళ్ళి ప్రస్తావ నెందుకు" అన్నాడు రవి - కావాలనే.

వస్తున్న కోపాన్ని దిగమింగి "దానిక్కాదురా! నీకే వాళ్ళు యాభైవేల రొక్కంగాక ఇతర లాంఛనాలవీ భారీగా ఇస్తామంటున్నారు. అందులో ఓ పాతికవేలతో తరళ పెళ్ళి జరిపించి, మిగిలిన డబ్బుతో పాత అప్పులు తీర్చేసుకొంటే హాయిగా వుంటుంది" అన్నాడాయన.

"నాన్నగారూ! యాభైవేలు కట్నంగా ఇచ్చిన ఆడపిల్లవాళ్ళు పాతికవేలకి బంగారం, పదివేలకి

చీరెలు కొనమంటారు. కట్నం తీసుకుని చులకన కావడం తప్పితే మిగిలేదేం ఉండదు." అన్నాడు మెల్లగా రవి.

ఉన్నమాటే అయినా ఆ నిజం ఒప్పుకోవడాని కాయన మనస్సంగీకరించలేదు. "చులకనయ్యేదేముంది - 'నల్లురితో నారాయణ" అనక తప్పదురా " అన్నాడు.

"నాన్నా! మీరెంతైనా చెప్పండి - కట్నం తీసుకోవడం అంటేనే నాకిష్టంలేదు. పైగా నేను మా కొలీగ్ సునీతనిష్టపడుతున్నాను. ఆ అమ్మాయిదీ మధ్యతరగతి కుటుంబం... మన కష్టసుఖాలవీ చక్కగా అర్థం చేసుకుంటుంది కూడా"

"అదా సంగతి! కట్నం ఎగ్గొట్టడానికీ కాలం ఆడపిల్లలెన్నో నాటకాలు వేస్తూంటారు నువ్వో వెర్రివెధవలా ఆ వలలో చిక్కుకు పోయి ప్రేమా - దోమా అంటున్నావ్"

"నాన్నగారూ! ఆ అమ్మాయ్ నాకన్నా ఎక్కువే చదివింది. నాకన్నా ఎక్కువే సంపాదిస్తోంది. మేం ఒకర్నొకరు అర్థం చేసుకొన్నాం అంతేగానీ వల - చేపపిల్లా అంటూ మాట్లాడకండి" విసుగ్గా అన్నాడు రవి.

"ఏంట్రా! నోరు బాగా పెరిగిపోతోంది. సంపాదన మొదలెట్టి రెండేళ్ళైనా కాలేదు - ఈ పిచ్చివేషాలు మాని నే చూసిన పిల్ల మెళ్ళో మూడుముళ్ళూవేసెయ్" అన్నాడు ప్రసాదరావు కటువుగా.

"క్షమించండి. నాకిష్టం లేని పని నేచెయ్య లేను. తరళ పెళ్ళి బాధ్యత మాది - నా ఇష్టాఇష్టాలు గమనించడం మీ ధర్మం" ఖచ్చితంగా చెప్పాడు రవి.

"ఒక్కోసారి మన ఇష్టాల్ని - అటక ఎక్కించక తప్పదు నాయనా" వ్యంగ్యంగా అన్నాడు ప్రసాదరావుగారు.

"నాన్నా! పూటకో రుచి కావాలి మీకు. తిండి విషయంలోనే ఏదయితేనేం అని సరిపెట్టుకోలేని మీరు - నాకు ఇష్టాలనణచుకోడం గురించి చెబుతున్నారా? మీ ఇష్టాలకెంత విలువ నిచ్చుకొంటున్నారో - అదే విలువ అవతలివాళ్ళ ఇష్టాలకీ వుంటుందని గ్రహించండి." అని గట్టిగా చెప్పి విసురుగా బైటకు వెళ్ళిపోయాడు రవి.

నిర్ఘాంతపోయాడు ప్రసాదరావు.

"వాడన్నదాంట్లో అసహజం ఏమీ లేదు. వాడన్నట్లు కట్నం తీసుకొచ్చే కోడలికి మనం లోకువ కావడం తప్ప మనకు మిగిలేదేమిటండి? వాడి ఇష్టాన్ని మన్నించి సునీతనే మన కోడలిగా చేసుకుందాం. తరళ పెళ్ళి బాధ్యతని వాడు తీసుకుంటానంటున్నాడుగా - ఇక మీ కెందుకు చింత" మెత్తగానే అయినా ఖచ్చితంగా చెప్పింది జానకి, మొదటిసారిగా ధైర్యం చేసి.

రవి మాటలు ఆయనకు సూటిగా తగిలాయి. ఇన్నాళ్లూ తనెంత స్వార్థంతో వ్యవహరిస్తూ వచ్చాడో అర్థమైంది.

కొడుకు ఇష్టాన్ని మన్నించడంతోనే తన పెద్దరికం నిలబడుతుందని గ్రహించి భార్యమాటలకు తలపంకిస్తూ వుండిపోయాడు ప్రసాదరావు!

## కవితా వని(త)

### ఆండాళ్ళు పట్టుచీర

ఆండాళ్ళమ్మ పట్టుచీర
అద్దకాల గళ్ళ చీర
జానెడంత సరిగంచు
అక్కడక్కడ చిలక బొమ్మలు
చూడగానె ముచ్చటలు
కునుకు రాదె ఆండాళ్ళమ్మకి
వాయిదాల మీద, హామీలతోను
ఇల్లుచేరె గళ్ళ చీర
ఆండాళ్ళు పట్టు చీర
ఊరంతటా చాటి చెప్పె
పేటంతా టమార మేసె
గళ్ళ చీర పక్కన పచ్చ చుక్కల రైక కూడా
ఏమీ అమరె ఏమికళ
ఆండాళ్లమ్మ పట్టుచీర ముద్దులొలుకు కొత్త చీర
చీర కట్టి రైక తొడిగి
వాడంతా పెత్తనాలు
కొండంత సంబరాలు
నిండైన చీరలో
పండంటి ఆండాళ్ళు
పట్టుచీర కట్టింది.
పచ్చరైక తొడిగింది
పిలిచిన పిలువకున్న
తనంతతాను పయనమాయె
ఆండాళ్ళు కాదు మన ఆండాళ్ళమ్మగారు
పక్కింటి పర్వతమ్మకి ఇసుమంత ఈసు కలిగి
ఇసుమంత కాదది కొండంతగా
పెరగసాగే
ఆండాళ్ళు చీర కాజేయనా
లేక కాలవలో పారేయనా?
ఓర్వలేని పర్వతమ్మ
ఓపిక పట్టసాగే, నిమిషాలు లెక్కించసాగే
ఆండాళ్ళు అమాయకత్వం
కపట మెరుగని మనస్సు పాపం
కాలం జరిగె, కొన్నాళ్ళ పిదప
పెళ్ళి వంకన అరువడిగే
పర్వతమ్మ ఆండాళ్ళుని
రెండునాళ్ళాయె, నాలుగు నాళ్ళాయె
వారమాయె, నెలకయినా ఇవ్వదాయె
ఆడగలేక ఊరుకునే,
అయ్యో మన ఆండాళ్ళు
చిట్ట చివరకు నోరు తెరచి
చీర ఏదని ఆరాతీసే
పర్వతమ్మ తొణకదు, బెణకదు
పరువు ఏమి కానోనని
జడుపు లేదు జంకు లేదు
చీరమడత తెచ్చి యిచ్చె
చప్పుడు గాకుండగా తెలివిగా,
విస్తుబోయె ఆండాళ్ళు
ఇంటికేగి మడత విప్పి
చిలక బొమ్మలేవి, సరిగంచు ఏది
అక్కడక్కడ కంతలే, చీరంతా చిరుగులే
నిండైన గళ్ళ చీర
జానెడై మిగిలి పోయె
ఏమిచేస్తివి పర్వతమ్మ
ఇదెక్కడి వింతలమ్మ
అరువు సొమ్ము ఇటులనా
తిరిగిస్తివి పర్వతమ్మ
పెద్దగా అరవసాగె,
రచ్చచేసె ఆండాళ్ళు
నేనేమి చేస్తిని, నాకేమి ఎరుక
పిల్లి వెధవని ఎత్తుకొంటి
పానకం పట్టిస్తిని
గ్లాసు జారి చీరన బడె,
పట్టుకోక నానిపోయె
కూకలేస్తిని చంటి వెధవని
దండెంపై ఆర వేస్తిని
పట్టు కొనే ఎర్ర చీమలు
కండచీమలు చీర నమిలె
చిలకలేమాయమాయె
అంచులే చిన్న బోయె
పర్వతమ్మది పెద్ద బుర్ర
వెనుతిరిగె ఆండాళ్ళు
చిన్న మనసున ఇంటికేగె
వాయిదాలు మిగిలిపోయె
చిలకలే ఎగిరిపోయె
చిరుగులే మిగిలిపోయె
ఎన్నాళ్లకి తీర్చుకోను
ఆ వాయిదాలు
అయ్యయ్యో ఆండాళ్ళు
అయ్యారే విచిత్రాలు!

—గౌరవరపు శారద